అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: హెచ్‌ఎంటీనగర్ చెరువుకట్టపై హైకోర్టుకాలనీ వరకు రూ.17 లక్షలతో చేపట్టిన పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గుంతలను పూడ్చడంతో వాకింగ్ చేసుకునేందుకు ఎలాంటి అసౌకర్యం ఉండదన్నారు. హెచ్‌ఎంటీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు యాదగిరిరెడ్డి, నర్సింగ్‌రావు, కిరణ్, మాక్బూల్, రామరాజు, బీఆర్‌ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, విఠల్‌యాదవ్, భూపాల్‌రెడ్డి, దాసరి కర్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో నిందితుడి రిమాండ్

ఆశ్రయం కల్పించిన మరో వ్యక్తి అరెస్ట్

కుషాయిగూడ: భార్యపై అనుమానంతో గొంతుకోసి హత్య చేసిన భర్తతో పాటుగా నిందితుడికి ఆశ్రయం కల్పించిన మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు. 19న అర్ధరాత్రి అణుపురం కాలనీలో భర్త, భార్య గొంతుకోసి హత్య చేసి పారిపోయిన విషయం తెలిసిందే. భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందన్న నెపంతో భర్త ఆమెపై అనుమానంతో భార్యను నిలదీశాడు. ఈ క్రమంలో వారి మధ్య మాట మాట పెరిగింది. విచక్షణ కోల్పోయిన భర్త ఇంట్లోని కూరగాయాల కత్తితో భార్య గొంతుకోసి పరారయ్యాడు. నిందితుడు మరుసటి రోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో పటాన్‌చెరులోని వరసుకు అల్లుడైన పాట్టిపాక హరికృష్ణ వద్దకు వెళ్లాడు. భార్యను హత్య చేసిన విషయాన్ని అతడికి చెప్పాడు. దీంతో హరికృష్ణ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి అమీన్‌పూర్‌లోని తన మామ సత్యనారాయణ ఇంట్లో శంకర్‌కు ఆశ్రయం కల్పించాడు. సమీపంలోని పొదల్లో లభ్యమైన కత్తి, రక్తపు బట్టలు, సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నిందితుడి ఆచూకీ లభించింది. దీంతో వారు బుధవారం నిందితుడు శంకర్‌తో పాటుగా ఆశ్రయం కల్పించిన హరికృష్ణను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎలక్ట్రిక్ వాహనంలో మంటలు

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు ఓ ఎలక్ట్రికల్ స్కూటర్‌కు మంటలు అంటుకున్నాయి. అంతా చూస్తుండగానే స్కూటర్ పూర్తిగా మంటల్లో కాలిపోయింది. ఈ ఘటన బుధవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధి సైనిక్‌పురి చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఎలక్ట్రికల్ బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి బైక్‌లో స్పార్కింగ్స్ రావడాన్ని గమనించి స్టాండ్ వేసి పక్కకు వెళ్లినట్లు తెలిపారు. నిమిషాల వ్యవధిలోనే స్కూటర్ మంటల్లో కాలిపోయిందని వాపోయాడు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

మల్కాజిగిరి: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 4 ద్విచక్ర వాహనాలను గురువారం 25న వేలం వేస్తున్నట్లు మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆసక్తి గల వారు గుర్తింపుకార్డుతో రూ.2 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.


అక్రమ నిర్మాణం సీజ్



వెంకటాపురంలో సీజ్ చేసిన అధికారులు

అల్వాల్: నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తు భవనాన్ని అల్వాల్ జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ సర్కిల్ పరిధిలోని వెంకటాపురం డివిజన్ ముత్యంరెడ్డి నగర్‌లో జీ+1కు అనుమతులు తీసుకుని అదనపు అంతస్తుల నిర్మాణం చేపట్టినందుకు నోటీసులు జారీచేసిన అధికారులు బుధవారం భవనాన్ని సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాలపై చర్యలు చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు.

చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి రూ.5.98 కోట్లు !



కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి రూ.5.98 కోట్ల నిధులు మంజూరైనట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తెలిపారు. డివిజన్ పరిధిలోని శ్రీసాయి వెంకట్ ఎన్‌క్లేవ్, శివసాయినగర్, శ్రీనివాసఎన్‌క్లేవ్, వీఎన్‌రెడ్డినగర్, శుభోదయకాలనీ, నాగార్జుననగర్, సోనియాగాంధీనగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, సాయికృష్ణనగర్, ఇందిరానగర్, నెహ్రూనగర్ కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు రూ.3.13 కోట్లు, సాయినగర్, కృష్ణారెడ్డినగర్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి టీఎఫ్ఆర్ నుంచి స్ట్రామ్ వాటర్‌లేన్ నిర్మాణానికి రూ.2.85 కోట్ల నిధులు మంజూరు చేస్తూ.. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించినట్లు పేర్కొన్నారు.



వ్యర్థాలతో నిండిపోయిన చిన్న చెరువు



చిన్న చెరువులో కలుస్తున్న డ్రైనేజీ మురుగు

అటకెక్కిన పారిశుద్ధ్యం !

చెత్త, మురుగుతో నిండిపోయిన చిన్న చెరువు ● దోమలకు ఆవాసాలుగా నాలాలు

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో దోమల బెడదతో ప్రతిరోజూ రాత్రుళ్లు కంటిమీద కునుకులేకుండాపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి 15 రోజులకోసారి దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాల్సిన ఉప్పల్ సర్కిల్ ఎంటమాలజీ విభాగం 2 నెలలు దాటినా ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు మరింత విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

వ్యర్థాల పారబోత..

రామంతాపూర్‌లోని పలు బస్తీలు, కాలనీల మధ్య ఉన్న చిన్న చెరువులో మురుగుతో పాటు ఇతర వ్యర్థాలు నిండిపోయాయి. వ్యర్థాలను తొలగించకపోవడంతో చెరువు దోమలకు ఆవాసంగా మారిపోయింది. దీంతో చిన్న చెరువుకు సమీపంలో ఉన్న నేతాజీనగర్, ఇందిరానగర్, ఆనంద్‌నగర్, శాంతినగర్‌లలో దోమలు విజృంభించి ప్రజలకు రాత్రిపూట కంటిమీద కునుకులేకుండా పోతోంది. రాంరెడ్డినగర్ నుంచి నాగోల్ వైపు వెళ్లే అతిపెద్ద వరద నీటి కాలువలో మురుగు చేరడంతో పాటు చెత్త,చెదారం, ఇతర వ్యర్థాలు నిండి ఉండటంతో దోమలకు ఆవాసంగా మారిపోయింది. దీంతో నాలాకు ఆనుకుని ఉన్న శ్రీనగర్‌కాలనీ రాంరెడ్డినగర్, సత్యానగర్, కుర్మానగర్, బాలకృష్ణనగర్, సాయికృష్ణనగర్, శ్రీరామకాలనీలో దోమలు విపరీతంగా విజృంభిస్తున్నాయి. ఆయా కాలనీలు, బస్తీల్లో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి..

రామంతాపూర్ చిన్న చెరువు సమీపంలో ఉన్న కాలనీతో పాటు వరద నీటి నాలాకు దగ్గరగా ఉన్న కాలనీలు, బస్తీల్లో దోమల నివారణకు కనీసం 10 రోజులకోసారైనా ఫాగింగ్ నిర్వహించేలా ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని ఆయా కాలనీల, బస్తీల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

పరిష్కారం ఇలా..

- చిన్న చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను అధికారులు తరచూ తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలి.
- చిన్న చెరువులోకి భూగర్భ డ్రైనేజీ మురుగు చేరకుండా చూడాలి. చెరువు, వరదనీటి నాలా నీటిలో పెరిగే దోమల లార్వాను నశింపజేయడానికి అధికారులు తరచూ యాంటీ లార్వాను పిచికారి చేయాలి.
- బస్తీలు, కాలనీల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త ఇతర వ్యర్థాలను తొలగించేలా చూడాలి.

తరచూ ఫాగింగ్ చేయాలి



నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను ప్రతి 15 రోజులకోసారి తొలగించేలా జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. నాలాకు సమీపంలో ఉన్న బస్తీలు, కాలనీల్లో దోమల నిర్మూలనకు కనీసం పది రోజులకు ఒక్కసారైనా ప్రత్యేకంగా ఫాగింగ్ చేయాలి.

– సందీప్, శ్రీనగర్‌కాలనీ

చెరువుల్లో మురుగు కలవకుండా చూడాలి



చిన్న చెరువులో కలుస్తున్న డ్రైనేజీ మురుగు చెరువుల్లో చేరకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలి. పేరుకుపోయిన వ్యర్థాలను వారానికోసారైన తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ఖాళీ స్థలాల్లో చెరువులో నాలాల్లో తరచూ యాంటి లార్వాను పిచికారి చేయాలి.

– పవన్, నేతాజీనగర్

‘స్వచ్ఛతా హీ సేవ’లో ప్రజలు భాగస్వాములవ్వాలి

కమిషనర్ త్రిలేశ్వర్‌రావు



మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలకసంస్థ పరిధిలో 17 నుంచి ప్రారంభమైన ‘స్వచ్ఛతా హీ సేవ’ కార్యక్రమాలు అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం బుద్ధానగర్ 40 ఫీట్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తను తొలగింపజేశారు. ప్రజలందరూ స్వచ్ఛతలో భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. శానిటరీ ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ బాలమురళీకృష్ణ, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్



రామంతాపూర్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదవీబాధ్యతలు చేపట్టిన తూళ్ల వీరేందర్‌గౌడ్‌ను బుధవారం రామంతాపూర్‌కు చెందిన రాష్ట్ర ఓబీసీ నాయకులు బొమ్మగాని రఘుపతిగౌడ్, ఆకుల నాగేశ్వర్‌రావు, చెల్లోజు ఎల్లాచారి, బానోతు రమేష్‌నాయక్, సురేష్, ఆకుల సాయి, రేవంత్‌గౌడ్ తదితరులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు, నేతలు సంఘటితంగా ఉండి మెజార్టీ స్థానాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు.

బాలికలపై అత్యాచారం !

నిందితుల రిమాండ్

అల్వాల్: స్కూల్ నుంచి అదృశ్యమైన ముగ్గురు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌లో నివసించే ముగ్గురు విద్యార్థినులు ఈనెల 20న అదృశ్యమయ్యారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. యాదగిరిగుట్టలోని ఓ ప్రైవేట్ లాడ్జీలో వారి ఆచూకీ లభించింది. తార్నాకలో వారికి మాయమాటలు చెప్పి ముగ్గురు యువకులు మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన మధు (19), వారాసిగూడకు చెందిన నీరజ్ (22), మల్లీశ్వర్‌నగర్‌కు చెందిన అరవింద్ (20)లు కలిసి యాదగిరిగుట్టలోని ప్రైవేట్ లాడ్జీకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. నిందితులను అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. లాడ్జి యజమాని సోమేష్ (40)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

మల్లాపూర్: భవానీనగర్ కమాన్ వద్ద రూ.78 లక్షలతో జరుగుతున్న ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇంజినీరింగ్ ఏఈ స్రవంతి, స్థానిక నేతలు భాస్కర్, పీఆర్.ప్రవీణ్, సంతోష్‌యాదవ్, రంగారెడ్డి, మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి, కాలనీవాసులు బాబుబాయ్, అజీమ్, శ్రీమన్నారాయణ, హనుమాన్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి వ్యాక్సినేషన్ చేయించాలి

కుషాయిగూడ: చిన్నారుల ఆరోగ్యానికి విధిగా వ్యాక్సినేషన్ చేయించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సకాలంలో టీకాలు వేయించి పిల్లలను ప్రాణాంతక వ్యాధుల భారి నుంచి రక్షించుకోవాలన్నారు. టీకాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఏఎన్‌ఎం నాగుబాయి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ అడ్డాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



కార్మికులకు చెక్కులను అందజేస్తున్న లేబర్‌లైన్ నేతలు

రామంతాపూర్: గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర అసంఘటిత కార్మికుల అడ్డాల వద్ద ప్రాథమిక సౌకర్యాలైన తాగునీరు, టాయిలెట్లు, కూర్చోవడానికి షెడ్లు ఏర్పాటు చేయాలని ఇండియా లేబర్‌లైన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం రామంతాపూర్‌లోని మౌంట్ ఫోర్టు సోషల్ ఇన్‌స్టిట్యూట్‌లో అసంఘటిత కార్మికుల హక్కుల పోరాట సంస్థ ఇండియా లేబర్ లైన్ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అసంఘటిత రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. 2021లో జూలై ప్రారంభమైన ఇండియా లేబర్ లైన్ సంస్థ చాలా మంది కార్మికులకు జీవనధారుగా నిలిచిందన్నారు.

సామూహిక సీమంతం



మల్కాజిగిరి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వసంతపురి కాలనీలో మాజీ కార్పొరేటర్ మురుగేష్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి మహిళ మాతృమూర్తి కావడాన్ని అదృష్టంగా భావిస్తారన్నారు. అమ్మవారి స్వరూపమైన వారికి కులమతాలకు అతీతంగా సామూహికంగా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఉమాపతి, వెంకటేష్, ఉపేందర్, నర్సింగ్, శ్రీనివాసరెడ్డి, రంగమ్మ, కవిత, సుబ్బలక్ష్మి కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

మల్కాజిగిరి: డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం విష్ణుపురికాలనీ, భ్రమరాంబికానగర్‌లోని పార్కులను హార్టికల్చర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రెండు పార్కుల్లో రూ.3 లక్షలతో నిర్వహణ పనులు చేపడుతున్నామన్నారు. మారుతీనగర్ పార్కు నిర్వహణకు కాలనీ సమాఖ్యకు నిధులు మంజూరు చేయలేదని వెంటనే నిధులు మంజూరు చేయాలని సూచించామన్నారు. మేనేజర్ మహేశ్వరి, రాజు, రమేష్, సుబ్బారావు, జైక్రిష్ణ పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ఉప్పల్: సమాజంలో జరుగుతున్న నేరాలపై రాచకొండ ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులకు ఉప్పల్‌లో గాంధీ విగ్రహం వద్ద అవగాహన కల్పించారు. ఎస్సై రాములునాయక్ మాట్లాడుతూ.. బాలకార్మికులు, నిర్బంధ కార్మికులు, లైంగిక వేధింపులు, రోడ్డుభద్రత, డ్రగ్స్ తదితర నేరాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలైన బీఎన్‌ఎస్‌పై ప్రజలకు వివరించారు. మహిళలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అనుమానం వస్తే 100కు డయల్ చేసి వివరాలు తెలపాలని కోరారు. సైబర్‌నేరాలు, వేధింపులకు గురైతే కొత్త నెంబర్ 112ను సంప్రదించాలని సూచించారు.



సూర్యనగర్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి



మాలధారణలో శాంతి యూత్‌క్లబ్ సభ్యులు



నాగార్జుననగర్ కాలనీలో..



గాయత్రీ దేవిగా జ్ఞానసరస్వతి అమ్మవారు

అన్నపూర్ణదేవి నమోస్తుతే !



దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల పరిధిలోని అమ్మవారి ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బుధవారం అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం



మారుతీనగర్‌లో కార్పొరేటర్ శ్రవణ్



పీర్జాదిగూడ శ్రీసాయినగర్‌లో మాజీ కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి



నేరేడ్‌మెట్ శ్రీరామ ఆలయంలో..



మల్కాజిగిరి లలితాదేవి ఆలయంలో..



కుషాయిగూడలో..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225470 | 9912220571